పెండింగ్ చలాన్లతో 8.44 కోట్ల ఆదాయం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 9.61 లక్షల పెండింగ్ చలాన్ల ద్వారా ప్రభుత్వానికి గురువారం నాటికి 8.44 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3.54 లక్షల చలాన్ల ద్వారా 2.62 కోట్లు, సైబరాబాద్ పరిధిలో 1.82 లక్షల చలాన్ల చెల్లింపు ద్వారా రూ.1.80 కోట్లు, రాచకొండ పరిధిలో 93 వేల చలాన్లకు రూ.76.79 లక్షల ఆదాయం సమకూరిందని ఉన్నతాధికారులు తెలిపారు.

సీఎస్ హెచ్చరిక అసత్య ప్రచారం: జీపడీ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని జీఏడీ అధికారులు ఒక ప్రకటనలో ఖండించారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, వారితో అసభ్యకరంగా మాట్లాడినా, దురుసుగా ప్రవర్తించినా, ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించినా, చేయి చేసుకున్నా ఐపీసీ సెక్షన్ల కింద చర్యలు తీసుకోబడును' అంటూ సీఎస్ హెచ్చరించిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని జీఏడీ అధికారులు వివరణ ఇచ్చారు.

తవ్వకాల్లో పాదముద్రలు

జనగామ జిల్లా పాలకుర్తిలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ కోసం చేపట్టిన తవ్వకాల్లో గురువారం పురాతన కాలం నాటి పాదముద్రలతో కూడిన బండ రాయి బయటపడింది. పిల్లర్ గుంతలు తవ్వుతుండగా కనిపించిన దీనిపై రెండు పాదాలతో కూడిన రూపం ఉందని కూలీలు తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు దీనిని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. -పాలకుర్తి

పొగమంచులో ఓవర్‌టేక్ వద్దు

- రోడ్లపై వాహనాల మధ్య దూరం పాటించండి
- లో-బీమ్‌లో హెడ్‌లైట్లను సెట్ చేయండి
- వాహనాలు తక్కువ వేగంతో వెళ్లడమే ఉత్తమ మార్గం
- ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ సూచన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కురుస్తున్నందున ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తెలవారకముందే కొందరి బతుకులు తెల్లారిపోతుంటే.. మరి కొందరి జీవితాలు అంధకారంలోకి జారుతున్నాయి. ప్రకృతికి అనుగుణంగానే వెళ్లాలే తప్ప.. వ్యతిరేకంగా వెళ్లవద్దని, అయినవాళ్లకు కన్నీరు మిగిల్చవద్దని తెలంగాణ పోలీసుశాఖ కోరుతున్నది. పొగమంచువేళ పౌరులు పాటించాల్సిన పలు జాగ్రత్తలను రైల్వే అండ్ రోడ్డు సేఫ్టీ ఏడీజీ కార్యాలయం విడుదల చేసింది. పొగమంచు వేళ వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని పోలీసుశాఖ సూచించింది. ముఖ్యంగా తక్కువ స్పీడుతో వెళ్లడం, వాహనాల మధ్య దూరాన్ని పాటించడం వల్ల ప్రమాదాలను సాధ్యమైనంతవరకు నివారించవచ్చని తెలిపింది.

వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలు

1) వాహనం ఏదైనా లో-బీమ్‌లో హెడ్‌లైట్లను సెట్ చేసుకోవాలి. హై-బీమ్‌లో ఉండటం వల్ల రోడ్డు కనిపించదు. హెడ్ లైట్ కిందికి ఉండటం వల్ల రోడ్డుపై ఉన్న మలుపులు, గుంతలు, స్పీడ్ బ్రేకర్లు సులువుగా కనిపిస్తాయి. విజిబిలిటీ వంద మీటర్ల కంటే తక్కువగా ఉంటే ఫాగ్ ల్యాంప్‌ను ఆన్ చేయడం మంచిది.
2) పొగమంచులో విజిబిలిటీ తక్కువగా ఉంటుంది కాబట్టి వేగాన్ని తగ్గించాలి. వేగంగా వెళ్తే.. పరిస్థితులను అంచనావేయడం కష్టం. లిమిటెడ్ స్పీడ్‌లో వెళ్లడం వల్ల రోడ్డుపై నడిచేవారి నుంచి, చిన్నచిన్న వాహనాల రాకపోకలు తెలుస్తాయి. పొగమంచులో వేగంగా వెళ్లడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా అది తీవ్రంగా ఉంటుంది. పరిమిత వేగంలో వెళ్లడమే ఉత్తమం.
3) పొగమంచు వేళ ఎదురుగా ఉన్న వాహనాలను చూడలేం కాబట్టి.. హారన్ ద్వారా వాటి దూరాన్ని అంచనా వేయవచ్చు. దట్టమైన పొగమంచులో ప్రయాణం చేస్తున్నప్పుడు అనుమానం ఉన్నప్పుడల్లా హారన్ కొట్టడం శ్రేయస్కరం. ముఖ్యంగా మ్యూజిక్/పాటలు వినడాన్ని పూర్తిగా మానుకోండి. అప్పుడే రోడ్డుపై వచ్చే వాహనాల దూరాన్ని అంచనా వేయొచ్చు.
4) విజిబిలిటీ తక్కువగా ఉన్నప్పుడు రోడ్డుపై ఉండే లైన్లను తప్పనిసరిగా ఫాలో కావాలి. వాటి ద్వారా మలుపులను సులువుగా గుర్తించవచ్చు.
5) పొగమంచులో ప్రయాణం చేస్తున్నప్పుడు ఎక్కడైనా మలుపులు తిరిగే దగ్గర పది సెకన్లపాటు సిగ్నల్స్ ఇవ్వడం మర్చిపోవద్దు. దీనివల్ల వెనుక నుంచి వచ్చే వాహనదారులకు మీరు వెళ్లే రూటుపై అవగాహన ఉంటుంది.
6) మంచు ఎక్కువగా కురుస్తుంటే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి.. అద్దాలను శుభ్రంగా తుడ్చుకోవడానికి ప్రయత్నించండి. బయటి నుంచి వైపర్ మంచును క్లీన్ చేసినా.. లోపలి అద్దానికి చెమ్మ దిగుతూనే ఉంటుంది. అదికూడా మీకు ఇబ్బంది కలిగించొచ్చు.
డ్రైవింగ్ చేస్తూ.. అద్దాలను క్లీన్ చేయడం మంచి పద్ధతి కాదు. ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుంది.
7) మంచులో ప్రయాణం చేస్తుంటే.. మీ వాహనంలో హీటర్‌ను తప్పనిసరిగా ఆన్ చేసుకోండి. దీనివల్ల గ్లాసెస్‌ను తరచూ తుడ్చే అవకాశం ఉండదు.
8) దట్టమైన మంచు పడుతున్న వేళ ప్రయాణం చేస్తున్నప్పుడు వాహనాలను ఓవర్‌టేక్ చేసే ఆలోచన మానుకోవాలి. కనిపించని రోడ్డులో డివైడర్, స్పీడ్‌బ్రేకర్, గుంతలు, మలుపులు ఎక్కడ ఉంటాయో మనకు కనిపించకపోవచ్చు. చాలా ప్రమాదాలు ఓవర్‌టేక్ జరుగుతున్నాయని నివేదికలు చెప్తున్నాయి.
9) వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు కచ్చితంగా వాహనాల మధ్య దూరాన్ని పాటించాలి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. మన ముందున్న వాహనానికి ఏదైనా ప్రమాదం జరిగినా.. ఆ తీవ్రత మన వరకు రాకపోవచ్చు.
10) ప్రయాణం ఏదైనా సరే.. పరధ్యానంగా ఉండొద్దు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు రోడ్డు పైనే దృష్టిసారించడం వల్ల ఎలాంటి తప్పు జరిగే అవకాశం ఉండదు. ఏ చిన్న తప్పు జరిగినా.. మనతోపాటు మనవారంతా జీవితాంతం బాధపడాల్సి రావొచ్చు.

చలికాలం.. జర పైలం

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం వేళల్లో పొగమంచు
- శ్వాసకోశ, ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశం
- వృద్ధులు, చిన్నారులపై ప్రభావం
- జాగ్రత్తగా ఉండాలంటున్న డాక్టర్లు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శీతాకాలంలో శ్వాస సంబంధ, ఊపిరితిత్తుల సమస్యలతో చర్మ సంబంధ వ్యాధులు అధికంగా వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్థులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు బ్యాక్టీరియా బయటకు వస్తుందని, వాటిని పీల్చితే రోగ నిరోధక శక్తి తక్కువ ఉండే వ్యక్తులకు వ్యాధి వ్యాపించే ప్రమాదం లేకపోలేదని పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతున్న తరుణంలో గుండెజబ్బులు వచ్చే అవకాశం కూడా ఉన్నదని తెలిపారు. చలికాలంలో జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. వేడి పోషకాహార పదార్థాలు తీసుకోవాలని, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. వృద్ధులు, చిన్నారులపై చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. రెండేండ్లలోపు పిల్లలకు శ్వాస సంబంధ న్యుమోనియా, ఆస్తమా వస్తాయని, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హైదరాబాద్‌లో చలి..

హైదరాబాద్ నగరంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 28.3 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 16.9 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 58 శాతంగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుందని పేర్కొన్నారు.

వచ్చే రెండురోజులు మరింత చలి

రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈదురు గాలులతోపాటు గాలిలో తేమశాతం పెరగడంతో తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురుస్తున్నట్టు పేర్కొన్నారు. మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, కామారెడ్డి, వరంగల్, హనుమకొండ, జనగామ, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల్లో మంచు తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, మధ్య తెలంగాణలో చలి తీవ్రత కొంత పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ వాయవ్య దిశలో కొంత వేడి ఉంటుందని వెల్లడించారు.

చదువులో అంతరాలు పోవాలి

- ప్రభుత్వ బడులు నిలబడాలి: తెలంగాణ పౌరస్పందన వేదిక
- విద్యారంగం 'ప్రైవేటు' చేతుల్లో ఉంది
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సర్కారు బడులు, బడ్జెట్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్ల పేరుతో విద్యలోకి చొరబడిన అంతరాలను తొలగించాలని తెలంగాణ పౌరస్పందన వేదిక కోరింది. రాష్ట్రంలో ఉచితంగా చదువు చెప్పే బడులతోపాటు రూ. 20 వేల ఉంచి రూ.6 లక్షల ఫీజు వసూలు చేస్తున్న స్కూళ్లు కూడా ఉన్నాయని వక్తులు పేర్కొన్నారు. ప్రభుత్వ బడులు నిలబడాలని, చదువులో ఈ అంతరాలు పోవాలని నినదించారు. తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాఠశాల విద్యపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ అమెరికాలో 91శాతం, చైనాలో 100 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని తెలిపారు. మన దగ్గర మాత్రం విద్యారంగం ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. సర్కారు స్కూళ్లను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం, లక్ష్మణ్‌రావు, మస్తాన్ రావు, జితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సూచనలు

- ప్రభుత్వ బడుల్లో 75-100 మంది విద్యార్థులుండాలి. తరగతికి ఒక టీచర్ ఉండాలి.
- ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలి.
- 200కు పైగా విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలకు రెండు సెక్షన్లు, 400లకు పైగా ఉంటే మూడు సెక్షన్లు ఏర్పాటుచేయాలి.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు సహించం

- కేసులు నమోదు.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం
- సిబ్బందే బ్రాండ్ అంబాసిడర్లు: ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి వెన్నుదన్నుగా నిలిచి నిత్యం నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ.. లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న సిబ్బందిపై దాడులకు దిగితే సహించబోమని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులు, దూషణలకు పాల్పడేవారు ఎంతటి వారైనా కేసులు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు చేపడతామని చెప్పారు. ఇప్పటికే జరిగిన ఘటనలపై అధికారులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారని, బాధ్యులపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులోనూ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, సంస్థకు సిబ్బందే బ్రాండ్ అంబాసిడర్లని చెప్పారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సహకరించాలని గురువారం ట్విట్టర్‌లో సజ్జనార్ కోరారు. కాగా, 'మహాలక్ష్మి' పథకం అదనపు బస్సుల ఏర్పాటుపై టీఎస్ఆర్టీసీ దృష్టిసారించింది. తక్కువ ఆదాయం వచ్చే ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు వెళ్లే రూట్లలో బస్సు సర్వీసులను తగ్గించాలని ఆర్టీసీ భావిస్తున్నది.

17 మంది ఖైదీలకు డిగ్రీ, పీజీ పట్టాలు

- 43 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం
- ఘనంగా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్నాతకోత్సవం

జీవిత ఖైదీకి డిగ్రీ పట్టా అందజేస్తున్న యూజీసీ చైర్మన్ ఎం జగదీశ్ కుమార్, డాక్టర్ అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీ వీసీ నీతారామారావు తదితరులు

హైదరాబాద్ సిటిబ్యూరో / చర్లపల్లి, డిసెంబర్ 28: డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో మాజీ వీసీ వీఎస్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. 17 మంది ఖైదీలకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేశారు. 43 మంది విద్యార్థులకు బంగారు పతకాలు (డిగ్రీలో 17, పీజీలో 26) అందజేశారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన యూజీసీ చైర్మన్ ఎం జగదీశ్ కుమార్ మాట్లాడుతూ.. 76 ఏండ్ల వయసు నిండిన వారు డిగ్రీలు పొందడం చాలా సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. డ్రైవర్, ఖైదీ, గృహిణి ఇలాంటి వారు డిగ్రీలు పొందడం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. యూనివర్సిటీ వీసీ నీతా రామారావు మాట్లాడుతూ.. డిగ్రీలో 20,972 మంది, పీజీలో 10,757 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, వీరందరికీ పట్టాలు ప్రదానం చేశామని తెలిపారు. కాగా, చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న 17 మంది జీవిత ఖైదీలు బీఏ, పీజీలో సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో పట్టాలు అందుకొన్నట్టు జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ తెలిపారు. అనంతరం డిగ్రీ పట్టాలు పొందిన ఖైదీ విద్యార్థులను అభినందించారు. సాత్నకోత్సవంలో పాలకమండలి సభ్యులు ఓయూ వీసీ రవీందర్ యాదవ్, ఆర్ శైలేశ్ రెడ్డి, డాక్టర్ బానోత్‌లాల్, రిజిస్ట్రార్ ఏవీ ఎన్ రెడ్డి, ప్రొఫెసర్లు ఘంటా చక్రపాణి, సుధారాణి, ప్రుష్ఠా చక్రపాణి, వడ్డానం శ్రీనివాస్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్, జైలర్ గొట్టే రామకృష్ణ, వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

76 ఏండ్ల వయసులో పీహెచ్‌డీ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ 76 ఏండ్ల వయసులో పీహెచ్‌డీ సాధించారు. గురువారం బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయనకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. నేటితరంలో చాలామంది కనీసం పీజీ కూడా పూర్తి చేయడం లేదని, అలాంటివారికి తాను మార్గదర్శిగా నిలవాలనే పీహెచ్‌డీ చేశానని ఇస్మాయిల్ తెలిపారు. తాను 2018లో హిందీలో పీహెచ్‌డీ ప్రారంభించానని చెప్పారు. 1984లోనే హిందీలో పీజీ, ఎంఫిల్ పూర్తి చేసినట్టు వెల్లడించారు.

అద్దెబస్సు టెండర్లకు ఓనర్లు దూరం

- 340 అద్దెబస్సులకు ఆర్టీసీ టెండర్లు
- గడువు సమీపిస్తున్నా స్పందన నిల్
- సమస్యలు పరిష్కరిస్తే ఆలోచిస్తాం
- తేల్చి చెప్తున్న అద్దెబస్సు సంఘం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడం, రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రభుత్వం 340 అద్దెబస్సుల కోసం టెండర్లు పిలిచింది. గడువు ముగుస్తున్నప్పటికీ టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. తాము లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తేనే టెండర్లు వేస్తామని, లేదంటే ఇక అంతేనని అద్దెబస్సుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు తేల్చి చెప్పారు. టెండర్ల దాఖలుకు జనవరి 3 గడువు కాగా, అదే రోజు మధ్యాహ్నం తర్వాత టెండర్లు తెరుస్తారు. మరోవైపు, గురువారం ఆర్టీసీ అధికారులు నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశంలో ప్రధానంగా అద్దెబస్సుల కేఎంపీఎల్ అంశంపై చర్చించారు. ప్రస్తుతం కేఎంపీఎల్ 4.5-4.6గా ఉండగా నగరంలో దానిని 4కు తగ్గించాలన్న డిమాండ్ ఉంది. అయితే, ఇది సాధ్యంకాదని చెప్తున్న ఆర్టీసీ గ్రేటర్ జోన్ అధికారులు అద్దెబస్సుల సంఘం ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

320 కొత్త బస్సులు

మహాలక్ష్మి పథకం కారణంగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో మరో 320 వరకు కొత్త బస్సులు తీసుకురావాలని ఆర్టీసీ భావిస్తున్నది. నిరుడు 560 వరకు విద్యుత్తు బస్సులకు టెండర్లు పిలిచినా వాటి సంగతి ఏంటన్న విషయంలో స్పష్టత లేదు. తాజాగా 340 అద్దెబస్సులకు టెండర్లు పిలిచినా తమ సమస్యలు పరిష్కరించకుంటే టెండర్లు వేయబోమని అద్దెబస్సుల యజమాన్యాలు తెగేసి చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా సమకూర్చుకోవాలనుకుంటున్న 320 బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేస్తుందా? లేదా? అన్న విషయంలో స్పష్టత లేదు. మరోవైపు, నగర అవసరాల కోసం సంక్రాంతి నాటికి 200 డీజిల్ బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే వెల్లడించారు.

డిమాండ్లు ఇవీ

- ప్రతి బస్సులో గరిష్ఠంగా 40 మంది మాత్రమే ప్రయాణించే అవకాశం ఉండగా మహాలక్ష్మి పథకం తర్వాత 100 నుంచి 120 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఇది బస్సు కండిషన్‌పై ప్రభావం చూపుతున్నది. కాబట్టి డ్రైవర్, కండిషన్, డీజిల్ నిర్వహణ వంటి వాటి గురించి ప్రభుత్వం పట్టించుకోవాలి.
- ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులకు కేఎంపీఎల్ 4.5గా, సిటీ బస్సులకు 4గా ఉండాలి.
- అద్దెబస్సు డ్రైవర్లు, ఇతర సిబ్బందికి ప్రతినెల 10న బిల్లులు చెల్లించాలి.
- సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి కాకుండా ప్రయాణికుల ఆధారంగా ఇన్సూరెన్స్ ఇవ్వాలి.

అక్రమ మద్యం అడ్డగింత

- 2022లో 579, 2023లో 1,848 అబ్కారీ కేసులు
- 1,006 మంది అరెస్టు, 29 వేల లీటర్ల మద్యం సీజ్
- 6,194 కేజీల గంజాయి, 3 వేల మొక్కల ధ్వంసం
- 854 ఎన్డీపీఎస్ కేసులో మొత్తం 1187 మంది అరెస్టు
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ అధికారులు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సరిహద్దుల నుంచి తెలంగాణలోకి అక్రమ మద్యం రాకుండా రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు సమర్థంగా అడ్డుకున్నారు. ఈ ఏడాది నమోదైన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) కేసులు, ఎన్డీపీఎస్ కేసుల వివరాలను అధికారులు గురువారం వెల్లడించారు. ప్రభుత్వానికి డ్యూటీ చెల్లించకుండా అక్రమంగా రాష్ట్రంలోకి మద్యాన్ని తీసుకొచ్చిన కేసులు 2022లో 579 నమోదు కాగా.. ఈ ఏడాది ఆ కేసుల సంఖ్య అమాంతం పెరిగింది. 2023 డిసెంబర్ 25 నాటికి 1,848 ఎన్డీపీఎల్ కేసులు నమోదైనట్టు తెలిపారు. వీటిల్లో 1,006 మందిని అరెస్టు చేసి, 151 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్డీపీఎల్ కేసుల ఉల్లంఘనల ద్వారా సుమారు రూ.6 లక్షల ఫైన్ వసూలు చేశారు. గతేడాది 11,395 లీటర్లు, ఈ ఏడాది 29,849 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కేసులు	2022	2023
1) ఎన్డీపీఎస్ కేసులు	723	854
అరెస్టులు	1248	1187
గంజాయి	4,556 (కేజీ)	6,194(కేజీ)
గంజాయి మొక్కలు	1,480	3,311
హ్యాష్ ఆయిల్	25.04 (కేజీ)	11.63 (కేజీ)
ఆల్ప్రజోలం	3.33 (కేజీ)	33.3 (కేజీ)
కొకైన్	213 (గ్రా)	199 (గ్రా)
హెరాయిన్	354.3 (గ్రా)	75.5 (గ్రా)
సీజ్ చేసిన వాహనాలు	313	282
బైండోవర్లు	1,520	993
జరిమానా	రూ.24,05,000	రూ.13,75,000
2) ఐఎంఎల్ కేసులు	837	651
అరెస్టులు	109	56
3) మద్యం అక్రమ అమ్మకాలు	1,742	9,343
అరెస్టులు	1,751	7,840
బైండోవర్లు	2,195	6,844
సీజ్ చేసిన మద్యం	11,017 (లీ)	95,823 (లీ)
సీజ్ చేసిన బీర్లు	6,651 (లీ)	44,042 (లీ)
వాహనాల స్వాధీనం	44	486
4) కల్లు సంబంధిత కేసులు		
తీసుకున్న శాంపిల్స్	4,303	3,687
అక్రమ కల్లు దుకాణాలు	326	5,265
అక్రమ కల్లు రవాణాలో అరెస్టులు	280	495
నకిలీ కల్లు ధ్వంసం	19,090 (లీ)	16,82,678 (లీ)
వాహనాల స్వాధీనం	8	33

పెరిగిన గుడుంబా కేసులు

గతేడాది 9,998 గుడుంబా కేసులు నమోదవగా.. రాష్ట్రంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో 21,831 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 12,436 మందిని అరెస్టు చేసి, తరచుగా గుడుంబా అమ్ముతున్న 14 మందిపై పీడీ యాక్టు నమోదు చేశారు. మొత్తంగా ఈ ఏడాది 1,36,143 లీటర్ల గుడుంబా, 6,73,425 కేజీల తాటిబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. 63,60,032 లీటర్ల పానాకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఏడాది 1,890 వాహనాలను స్వాధీనం చేసుకొని, రూ.1,54,45,000 జరిమానా విధించారు. ఈ ఏడాది 11,119 మందిని బైండోవర్ చేయగా.. 102 మందికి శిక్షతోపాటు జరిమానా కూడా విధించినట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులు తెలిపారు.

కాళేశ్వరంపై ప్రత్యేక పీపీటీ

- ప్రాణహిత - చేవెళ్ల తో పోల్చుతూ రూపకల్పన
- రీడిజైన్ మొదలు నిర్మాణం వరకు..
- పునరుద్ధరణ చర్యలపై కూడా..
- ఇంజినీరింగ్ అధికారుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- నేడు మేడిగడ్డకు రాష్ట్ర మంత్రులు
- అధికారులతో ప్రత్యేక సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై 110 పేజీలతో ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను (పీపీటీ) ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు రూపొందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు, రీడిజైన్ అనంతరం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో చేసిన మార్పులు, చేర్పులు అందులో పొందుపరిచారు. దానిని శుక్రవారం మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించనున్న మంత్రులకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రీడిజైన్, నిర్మాణం, నిర్వహణ, ఆయకట్టు కల్పనపై కాంగ్రెస్ నేతలు ఆదినుంచీ అనేక విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని పలు పిల్లర్ల కుంగుబాటుకు గురైన నేపథ్యంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసింది. ఈ ప్రాజెక్టును సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు సందర్శించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుకు సంబంధించి సమస్త వివరాలను అందించాలని, నిర్మాణ ఏజెన్సీలు, సంబంధిత ఇంజినీర్లు అందరూ అందుబాటులో ఉండేలా చూడాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అధికారులు సిద్ధం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేసిన ప్రాణహిత-చేవేళ్ల ఎత్తిపోతల పథకం స్వరూపం, చేసిన ప్రతిపాదనలతోపాటు ఆ ప్రాజెక్టును రీడిజైన్ చేయడానికి కారణాలు, అందుకోసం చేసిన అధ్యయనాలు, రీడిజైన్ ద్వారా అదనంగా ఒనగూరిన ప్రయోజనాలు, సాగులోకి వచ్చిన ఆయకట్టు, పెరిగిన అంచనా వ్యయం, ప్రాజెక్టు నిర్వహణ, కరెంటు చార్జీలు తదితర అంశాలను పీపీట